పనులు లేక పస్తులు



వినియోగదారులు లేక బోసిపోయిన ప్రైవేట్ ఇసుక విక్రయ పాయింట్

- ఇసుక ధరలు పెరగడంతో నిలిచిన భవన నిర్మాణాలు
- వారంలో ఒక్కరోజు కూడా పని దొరకని వైనం
- ఆకలి బాధతో గడుపుతున్నామని కూలీల ఆవేదన
- భవన కార్మికుల ఉసురు పోసుకుంటున్న కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల నోట్లో ఇసుక కొడుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెరిగిన ఇసుక ధరల ప్రభావం కార్మికులపై పడింది. వారికి కూలి దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పూట గడవని స్థితిలో దినసరి కూలీలు ఆకలి కేకలు పెడుతున్నారు. ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థులు ఉచిత ఇసుక సరఫరా చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎంతో ఆశతో ఓట్లు వేసి కూటమికి పట్టం కట్టారు. అధికారం చేతికందాక కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక ఇవ్వ లేదు సరికదా గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగిన ఇసుక ధరలను నియంత్రించలేకపోతోంది. పెరిగిన ధరలకు భయపడి భవన నిర్మాణం పనులను యజమానులు నిలిపేశారు. దీంతో కూలీలకు పని దొరక్క ఇబ్బంది పడుతున్నారు.





రవీంద్రనగర్ బస్‌స్టాప్ వద్ద కూలి పని కోసం ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వేల సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులున్నారు. వీరంతా వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి బతుకుదెరువు కోసం వలస వచ్చినవారే. ఆరిలోవ, రవీంద్రనగర్, డెయిరీఫారం, ఇసుకతోట, వెంకోజీపాలెం, మద్దిలపాలెం, ఉషోదయా కూడలి ప్రాంతం, పెదవాల్తేరు, చినవాల్తేరు తదితర ప్రాంతాల్లో వీరంతా నివసిస్తున్నారు. రవీంద్రనగర్, ఇసుకతోట, ఉషోదయా ప్రాంతాలకు రోజూ ఉదయం 8 గంటలకే చేరుకుంటారు. ఆ పాయింట్ల వద్దకు మేస్త్రీలు వచ్చి అక్కడ నిరీక్షిస్తున్న కార్మికులను పలు ప్రాంతాల్లో జరిగే భవన నిర్మాణాల వద్దకు పనుల కోసం తీసుకెళ్తుంటారు. వారిచ్చే కూలి డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకునేవారు.

మూడు నెలలుగా దయనీయ పరిస్థితి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడు నెలల్లో కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. పనులకు తీసుకెళ్లే మేస్త్రీలు ఎవ్వరూ వారి వద్దకు రావడం లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలో ఎదురుచూసి ఈసురోమంటూ ఖాళీ చేతులతో ఇంటికి వెనుదిరుగుతున్నారు. కూలి కోసం మేస్త్రీలను అడిగినా ఇసుక ధరలు పెరగడం వల్ల భవన నిర్మాణ పనులు నిలిపేశారని, అందుకే పనికి పిలవడం లేదని సమాధానం చెబుతున్నారంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు 3, 4 రోజులే పని దొరుకుతోందని వాపోతున్నారు.

'తూర్పు'లో టన్ను రూ.2,000

తూర్పు నియోజకవర్గంలో ఇసుక కావాలంటే టన్ను రూ.2,000 ఇచ్చి కొనాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలో అందుబాటులో ఇసుక స్టాక్ పాయింట్ లేకపోవడంతో ఆనందపురంలో ఇసుక వ్యాపారుల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇసుక వ్యాపారులు ఒడివా రాష్ట్రం కటక్ నుంచి ఇసుకను ఆనందపురం తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఇసుక కావాల్సినవారు అక్కడకు వెళ్లి కొంటున్నారు. ఆనందపురం నుంచి ఆరిలోవ, విశాలాక్షినగర్, ఇసుకతోట, వెంకోజీపాలెం, ఎంవీపీ కాలనీ తదితర ప్రాంతాలకు చేరడానికి 18 టన్నుల ఇసుక లారీ ట్రాన్స్‌పోర్టుతో కలిపి రూ.36,000(టన్ను రూ.2000 చొప్పున) పడుతోంది. దీంతో ఇంత ధరలకు కొనలేక, అవి తగ్గాక నిర్మాణాలు కొనసాగించవచ్చనే ఆలోచనతో ప్రస్తుతం పనులు నిలిపేస్తున్నారు. దీంతో కూలీలకు పని దొరక్క ఆకలి కేకలు పెడుతున్నారు. చిల్లర వ్యాపారుల వద్ద కూడా ఎవరూ ఇసుక కొనడం లేదు. బేరాలు లేక నష్టపోతున్నామని ఇసుక చిల్లర వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలలో 2, 3 రోజులే పని



మేము కుటుంబంతో విజయనగరం జిల్లా గరివిడి నుంచి బతుకుదెరువు కోసం విశాఖ వచ్చాం. రవీంద్రనగర్‌లో ఉంటూ తాపీ పనులకు వెళ్తున్నా. ఇసుక ధరలు పెరగడంతో నిర్మాణాలు జరగడం లేదు. దీని వల్ల మమ్మల్ని ఎవరూ పనికి పిలవడం లేదు. నెలలో 2, 3 రోజులు మాత్రమే పని దొరకడంతో ఇల్లు గడవడం లేదు. – వై.ఆదిలక్ష్మి, రవీంద్రనగర్

ఇంటి అద్దె కట్టలేకపోతున్నాం



రోజూ తెల్లవారే సరికి రవీంద్రనగర్ ఆఖరి బస్‌స్టాప్ వద్దకు వస్తున్నాం. పని కోసం ఏ మేస్త్రీ వచ్చి పిలుస్తాడోనని ఎదురు చూస్తున్నాం. ఎవ్వరో ఒకరు వచ్చి నలుగురో, ఐదుగురో కావాలని వారినే తీసుకెళ్తున్నారు. మిగిలిన సుమారు 50 మందికి పైగా ఇక్కడ పనిలేక ఇంటిముఖం పట్టాల్సి వస్తుంది. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజు కూడా కట్టలేకపోతున్నాం. – సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మికుడు

ఇల్లు గడవడం లేదు



గతంలో మాదిరిగా ఇప్పుడు పనులు దొరకడం లేదు. ఇసుక ధరలు పెరగడంతో నిర్మాణ పనులు మానేశారు. దీంతో కూలి పనులు దొరకడం లేదు. ఇల్లు గడవడం లేదు. ఇంటి అద్దె కూడా చెల్లించలేకపోతున్నాను. దసరా పండగ కూడా చేసుకోవడానికి చేతిలో చిల్లి గవ్వైనా లేదు. – లోగిస రాము, కార్మికుడు, ఆరిలోవ

మోసం చేసిన కూటమి ప్రభుత్వం



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పారు. అధికారం చేపట్టాక ఉచిత ఇసుక ఊసేలేదు సరికదా ఎప్పుడూ లేని విధంగా ఇసుక ధరలు పెరిగిపోయాయి. భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ఓట్లు వేసినందుకు పేదలకు తగిన బుద్ధి చెప్పింది. – రమణ, సీఐటీయూ ఆరిలోవ జోన్ కార్యదర్శి

జీవీఎంసీ స్క్రాప్ వాహనాలపై నిర్లక్ష్యం వద్దు



ముడసర్లోవలో వాహన రిపేర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఆరిలోవ: జీవీఎంసీకి చెందిన స్క్రాప్ వాహనాలపై నిర్లక్ష్యం వహించొద్దని ఇంజినీరింగ్ అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సూచించారు. ముడసర్లోవ వద్ద జీవీఎంసీ వాహన రిపేర్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ జీవీఎంసీకి చెందిన పాడైన వాహనాలు, ప్రమాదానికి, మరమ్మతులకు గురైన వాహనాలను పరిశీలించారు. కుప్పలుగా పడి ఉన్న వాటిని చూసిన జీవీఎంసీ కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలను ఏళ్ల తరబడి ఎందుకు నిల్వ ఉంచాల్సి వచ్చిందని, మరమ్మతులకు గురైన వాటికి రిపేర్లు ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. వాటికి సంబంధించిన వివరాలతోపాటు ఇంటింటి నుంచి వ్యర్థాలు సేకరిస్తున్న వాహనాల వివరాలను వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ వాహనాలకు సంబంధించిన ఇంధన వినియోగం, ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఏన్యువల్ మెయింటినెన్స్ కాంట్రాక్ట్ ఖర్చును తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన వైద్యాధికారి, మెకానికల్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్లు సంయుక్తంగా జోనల్ స్థాయిలో ప్రక్షాళన చేస్తూ జీవీఎంసీకి ఆర్థిక నష్టం కలగకుండా ఖర్చును నియంత్రించాలని సూచించారు. పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కేసులు పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ అజిత

టీచ్‌రోడ్డు: త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని ద్వారకా ఏసీపీ కార్యాలయాన్ని శనివారం డీసీపీ అజిత వేజెండ్ల ఆకస్మికంగా సందర్శించారు. ఆమెకు ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు కేసుల వివరాలను తెలియజేశారు. రికార్డుల నిర్వహణ, కేసుల పురోగతిపై డీసీపీ సమీక్షించారు. త్వరితగతిన కేసులు పరిష్కరించాలని, రికార్డుల నిర్వహణపై శ్రద్ధ వహించాలని సూచించారు.

క్లుప్తంగా

దుర్గమ్మ దయ ఉంటే.. అన్నీ ఉన్నట్టే...



ప్రవచిస్తున్న గరికిపాటి నరసింహారావు

బీచ్‌రోడ్డు: దుర్గమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని, దసరా రోజుల్లోనే కాకుండా ప్రతి రోజూ అమ్మవారిని పూజించాలని ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న దేవీ వైభవం మూడో రోజు కార్యక్రమంలో ఆయన ప్రవచించారు. శ్యామలాదేవి దండకం కోసం వివరించారు. హైందవ ధర్మం, మాతృభాషను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, రోటరీ విశాఖ ప్రతినిధి ఆర్జీఎస్ జగన్మోహన్, ప్రెసిడెంట్ బి.వినయగాంధీ, సెక్రటరీ బి.మణిమాల, కోశాధికారి ఎం.కె.కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



కళాశాలలో మౌల్డ్ చైర్ల విభాగాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థుల సంఘం తరఫున 1991–94 ఎంపీసీ బ్యాచ్ విద్యార్థులు 20 మౌల్డ్ చైర్లు వితరణ చేశారు. ఈ కుర్చీలు ఏర్పాటు చేసిన విభాగాన్ని శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీ గిరి, అస్లాం, ఎం.వినోద్‌బాబు, పి.జగదీష్, డాక్టర్ సంగీత్, ఎన్.శివరామకృష్ణ, రేవతి, పద్మ, అమర్‌కుమార్ తదితర 1991–94 బ్యాచ్ విద్యార్థులు కళాశాలకు అందించిన మౌల్డ్ చైర్స్‌ను విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రత్యేక విభాగంలో ఏర్పాటు చేశామన్నారు. పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు జి.వి.ప్రతాప్, జి.అరుణ్‌కుమార్, సి.వి.ఎస్.రవీంద్రనాథ్, ఉమామహేశ్వరరావు, కె.రవిబాబు, ఎం.శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న సొసైటీ చైర్మన్ విద్యాసుందర్

విశాఖ సిటీ: ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆల్ సెయింట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.లక్ష విరాళంగా అందించింది. సంస్థ చైర్మన్ డాక్టర్ వి.విద్యాసుందర్ శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావును కలిసి చెక్కు అందజేశారు. దీనిని సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వి.కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



చైర్మన్ నారాయణరావును సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర నాయకులు

మద్దిలపాలెం: ఆర్టీసీ చైర్మన్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన కొనకళ్ల నారాయణరావుకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పి.వి.వి.మోహన్ విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో ఆయనను కలిసి సత్కరించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రావి సుబ్బారావు, రాజేష్‌కుమార్, విజయవాడ జోనల్ కార్యదర్శి అడపా రామారావు, జిల్లా కార్యదర్శి తులసి శ్రీనివాస్, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన



బయో డైవర్సిటీ పార్కు నిర్వహణ కమిటీ సభ్యులతో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

ఎంవీపీకాలనీ: పెదవాల్తేర్ ఆర్‌సీడీ హాస్పిటల్ ప్రాంగణంలోని బయో డైవర్సిటీ పార్కును శనివారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సందర్శించారు. ఆయనకు పార్కు నిర్వాహకుడు ఎం.రామమూర్తి, నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పార్కు నిర్వహణ, అక్కడ అందుబాటులో ఉన్న వినూత్న మొక్కలు, ఎడ్యుకేషన్ యాక్టివిటీస్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వైవిధ్యమైన మొక్కలను ఆసక్తిగా తిలకించారు. పార్కులో అన్ని విభాగాలను పరిశీలించి పలు మొక్కల విశిష్టతను తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా అరుదైన జాతికి చెందిన అంజీర్ ఫికస్ కారికా మొక్కను పార్కులో నాటారు. పార్కు అభివృద్ధికి అసవరమైన సహకారం అందిస్తానని నిర్వాహకులకు కమిషనర్ విశ్వనాథన్ మాటిచ్చారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ డీఎస్‌వో శాంతిస్వరూప్, ఎఫ్ఆర్‌వో శ్యామల, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, పార్కు నిర్వహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


త్రీటౌన్ పోలీస్ క్వార్టర్స్‌లో మౌలిక వసతులు



పోలీస్ కుటుంబ సభ్యులతో సీపీ శంఖబ్రత బాగ్చీ

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద గల పోలీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను శనివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. గతంలో ఈ క్వార్టర్స్‌ను సీపీ సందర్శించినప్పుడు పోలీస్ కుటుంబ సభ్యులు ఇచ్చిన వినతుల మేరకు నూతన సౌకర్యాలు కల్పించారు. క్వార్టర్స్‌లో లైటింగ్, పాడైన డ్రైనేజీ వ్యవస్థ, సీసీ కెమెరాలు, దట్టమైన పొదలు, రోడ్లు అధ్వానంగా ఉండటాన్ని సీపీ గుర్తించి సంబంధిత అధికారుల ద్వారా త్వరితగతిన మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పూల తోరణాలతో ఆహ్వానం పలికిన పోలీస్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నూతన వసతుల ప్రారంభం అనంతరం సీపీ ఇతర సమస్యలపై ఆరా తీయగా.. క్వార్టర్స్ ఫెన్సింగ్ వాల్‌కు గేట్ ఏర్పాటు చేయాలని, కిటికీల తలుపులు మార్చాలని, తాగునీటి సరఫరా సమయం పెంచాలని, క్వార్టర్స్‌కు పెయింటింగ్ వేయించాలని పోలీస్ కుటుంబాలు కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

బీచ్‌రోడ్డు: జూనియర్లపై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి హెచ్చరించారు. ఏయూ అంతర్జాతీయ హాస్టల్స్ విద్యార్థులకు శనివారం ర్యాగింగ్, గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అలవాటు చేసుకొని జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి వినియోగం, విక్రయాలు జరిగితే తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు, యూనివర్సిటీకి మంచి పేరు తీసుకొని రావాలని ఏసీపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మూడో పట్టణ సీఐ పల్లా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నవరాత్రి సంబరాలు



నృత్యంతో అలరిస్తున్న విద్యార్థినులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని సమత డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం దసరా నవరాత్రి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకలను కళాశాల కరస్పాండెంట్ విజయరవీంద్ర జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అన్నపూర్ణాదేవి అవతారం రోజున కళాశాలలో ఉత్సవాలు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆశీస్సులు సిబ్బంది, విద్యార్థులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పలు అమ్మవారి ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ వేషధారణలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కోలాటం, బతుకమ్మ, దాండియా నృత్యాలతో విద్యార్థినులు ఆద్యంతం అలరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యుమానిటేరియన్ అసిస్టెన్స్ ట్రస్టుకు సోషల్ ఇంపాక్ట్ అవార్డ్

బీచ్‌రోడ్డు: ప్రతిష్టాత్మక బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా మొబిలిటీ సోషల్ ఇంపాక్ట్ అవార్డును నగరానికి చెందిన సెంటర్ ఫర్ హ్యుమానిటేరియన్ అసిస్టెన్స్ ట్రస్ట్ గెలుచుకుంది. మొబిలిటీ నైపుణ్యాల ద్వారా ఆదివాసీ మహిళలకు సాధికారిత కల్పించడమే లక్ష్యంగా ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చినందుకు 2024 సంవత్సరానికి గానూ ఈ సామాజిక సేవా సంస్థకు అవార్డు అందజేశారు. ఈ ప్రాజెక్ట్ మహిళల ఆర్థిక స్వావలంబన, లింగ సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. డ్రైవింగ్ శిక్షణ ద్వారా మహిళలను నైపుణ్యం, స్వతంత్రులుగా మారుస్తుంది. ఈ సందర్భంగా బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి యోషిజానే మాట్లాడుతూ సర్వింగ్ సొసైటీ విత్ సుపీరియర్ క్వాలిటీ అనేది బ్రిడ్జ్‌స్టోన్ లక్ష్యమని తెలిపారు. మన చుట్టూ ఉన్న వ్యక్తులు, కమ్యూనిటీకి మనం ఎలా దోహదపడతామో.. అన్నది ముఖ్యమన్నారు. ఆదివాసీ మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.

అన్నపూర్ణాదేవిగా విజయదుర్గాదేవి



సింహగిరి కాలనీలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గాబజార్, పాత ఆరిలోవ, చినగదిలి లలితానగర్ ప్రాంతాల్లోని దుర్గాదేవి ఆలయాలలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. 9వ వార్డు హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలోని వియదుర్గాదేవి ఆలయంలో శనివారం అమ్మవారిని నిర్వాహకులు, అర్చకులు అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు.

ఘనంగా దుర్గాదేవి పూజలు

జీవీఎంసీ 9వ వార్డు సింహగిరి కాలనీలో ఫ్రెండ్స్ అండ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో శనివారం దుర్గాదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. స్థానికలో మహిళలు, భవానీ మాలధారులు అమ్మవారికి పూజలు జరిపారు. అన్నంతో అన్నపూర్ణాదేవికి అభిషేకం చేశారు.

- ఇసుకతోట రామాలయం వద్ద దేవీ బాయ్స్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కాళీమాత అమ్మవారికి నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.



హనుమంతవాకలో అన్నపూర్ణాదేవిగా విజయదుర్గాదేవి



ఇసుకతోటలో పూజలందుకుంటున్న కాళీమాత

నీటి నిల్వలే దోమల నిలయాలు



వరాహగిరినగర్‌లో డెంగ్యూ బాధితుడి ఇంటిని పరిశీలిస్తున్న మలేరియా అధికారి తులసీరాజ్

మద్దిలపాలెం: నిల్వ నీరు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా నిలుస్తున్నాయని, ఎప్పటికప్పుడు ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ సూచించారు. చైతన్యనగర్, మద్దిలపాలెం, వరాహగిరినగర్‌లో నమోదైన డెంగ్యూ కేసుల గృహాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే–డ్రైడే కార్యక్రమానికి స్థానికులు సహకరించాలని కోరారు. ఇళ్లలో నీటి నిల్వలను గుర్తించే ఈ కార్యక్రమం ఎంతో కీలకమైనదన్నారు. వారం పైబడి నీటి నిల్వలో లార్వా ఉత్పత్తి అయి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఆ దోమ కాట వల్లే డెంగ్యూ జ్వరాలు సోకుతున్నాయన్నారు. నీటి నిల్వలు లేకుండా ఇళ్లలోని ఫ్రిడ్జ్‌లు, ఏసీ, ఎయిర్ కూలర్, వాటర్ ప్లాంట్, మనీ ప్లాంట్‌లో క్షుణంగా పరిశీలించి నీటిని తొలగించాలని సూచించారు. ఉచితంగా పంపిణీ చేసిన దోమ తెరలను వాడాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శేషుబాబు, సిబ్బంది, జీవీఎంసీ మలేరియా విభాగం, సిబ్బంది, యాంటీ లార్వా బృంద సభ్యులు పాల్గొన్నారు.

23న ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు

మహారాణిపేట: ఎట్టకేలకు ఏపీ నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికల అధికారిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డిని నియమించింది. మూడు సంఘాల మధ్య విబేధాలు కారణంగా నాలుగేళ్లుగా ఎన్నికలు జరగలేదు. సభ్యుల వినతి మేరకు మూడు గ్రూపులతో శ్రీనివాసరెడ్డి సమావేశాలు నిర్వహించిన అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. 8న ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. 14న తుది ఓటర్ల జాబితాతోపాటు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారు. జిల్లాకు సంబంధించి కో–ఆపరేటివ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ రిజిస్టర్ బి.శ్రీనివాస్‌ను ఎన్నికల అధికారిగా నియమించారు. ఏపీ నర్సింగ్ అసోసియేషన్ జిల్లాలో పోటీ చేసేందుకు సభ్యులు విధిగా ఇప్పటికే ఐదేళ్ల పాటు సభ్యత్వం చెల్లించిన వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. 16న నామినేషన్లు, 17న పరిశీలన, 18న ఉపసంహరణ, 23న ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

● చేతికి చిక్కిన చేప





● సముద్రంలో వాలీబాల్



1. పెద జాలరిపేట వద్ద సముద్రంలో చేపలు పట్టేందుకు తాళ్లు వేస్తున్న మత్స్యకార పిల్లలు

2. సముద్రంలో నడుం లోతు నీటిలో ఈత కొట్టి పట్టిన చేపలను ఒడ్డుకు తీసుకొచ్చి ఆనందపడుతున్న మత్స్యకార యువత

3. పెద జాలరిపేట వద్ద సాగరంలో వాలీబాల్ ఆడుతున్న మత్స్యకార యువత

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం